క్లుప్తంగా

పారిశుధ్య పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న కమిషనర్

కోరుట్లటౌన్: పట్టణంలోని పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ రవీందర్ గౌడ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు వార్డులను పరిశీలించి పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. సింగల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగించవద్దని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజేంద్ర ప్రసాద్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

దుబ్బరాజన్నను దర్శించుకున్న డీఆర్‌డీవో పీడీ



స్వామివారి ప్రసాదాలు, చిత్రపటం అందిస్తున్న అర్చకులు, ఆలయ అధికారులు

సారంగాపూర్: ప్రముఖ పుణ్యక్షేత్రం దుబ్బరాజన్న ఆలయంలో స్వామివారిని డీఆర్‌డీఏ పీడీ రఘువరన్ బుధవారం కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదాలు, శేషవస్త్రాలను, స్వామివారి చిత్రపటాన్ని అందించి, అర్చకులు ఆశీర్వాదాలు అందజేశారు.

మోటార్ స్టార్టర్‌లో పాము



మల్లాపూర్: వ్యవసాయ బావి వద్ద గల స్టాటర్‌లోకి పాము దూరిన సంఘటన మండలంలోని పాత దాంరాజుపల్లిలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన దూరి నారాయణ తన పొలానికి నీరు పెట్టేందుకు వ్యవసాయ బావి వద్ద వెళ్లాడు. స్టాటర్ తెరిచి మోటార్‌పంప్‌ను ఆన్ చేసేందుకు చూడగా పాము కనిపించడంతో భయాందోళనకు గురయ్యాడు. విషయం తెలుసుకున్న సమీపంలోని రైతులు వెళ్లి స్టాటర్‌లోకి దూరిన పామును కర్రెలతో కదిలిస్తూ మెల్లగా బయటకు తీసి సమీప అటవీ ప్రాంతంలో వదిలివేశారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



పాఠశాల ఆవరణలో వంగిన స్తంభం

మల్లాపూర్: మండలంలోని కుస్తాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభం వంగిపోయి ప్రమాదకరంగా మారింది. దీంతో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్‌స్తంభాన్ని తొలగించాలని విద్యుత్‌శాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఎర్తింగ్‌తో స్తంభానికి కరెంట్ సరఫరా అవుతుందని హెచ్‌ఎం సత్తయ్య తెలిపారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని కోరారు.

కోర్టు వాడలో ఎక్సైజ్ సిబ్బంది తనిఖీ

మెట్‌పల్లి: పట్టణంలోని కోర్టు వాడలో బుధవారం గుడుంబా అమ్ముతున్నారనే సమాచారంతో ఎక్సైజ్ సిబ్బంది రాములు అనే వ్యక్తి ఇంట్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వారికి అందులో గుడుంబా లభించకపోవడంతో అతని కోడలును అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఆమెను బైండోవర్ చేయడానికి ప్రయత్నించగా, విషయం తెలుసుకున్న రాములు అక్కడకు వెళ్లి సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. తాము గుడుంబా విక్రయించకపోయినప్పటికీ ఇబ్బందులకు గురి చేయడం తగదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఫిర్యాదులు రావడంతోనే తనిఖీలు చేపట్టామని, గుడుంబా విక్రయిస్తూ పట్టుబడితే చర్యలు తీసుకుంటామని సిబ్బందికి చెప్పి పంపించి వేశారు.

లో లెవల్ వంతెనతో తిప్పలు

- వానొస్తే రాకపోకలకు ఇబ్బంది
- హై లెవల్ బ్రిడ్జి నిర్మించాలని కోరుతున్న ప్రజలు, వాహన దారులు
- 20 గ్రామాలకు వారధి



కమ్మరిపేట పెద్దవాగుపై లో లెవల్ బ్రిడ్జి

మేడిపల్లి: మండలంలోని కమ్మరిపేట పెద్దవాగుపై లోలెవల్ వంతెనతో వాహనదారుల తిప్పలు తప్పడం లేదు. వర్షాకాలంలో భారీ వర్షాలు కురిస్తే లోలెవల్ బ్రిడ్జిపై నుంచి వరద పోయి రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది.

2007 కి ముందు కమ్మరిపేట మండల కేంద్రానికి 10 కిలోమీటర్ల దూరం ఉండేది. గ్రామానికి సరైన రోడ్డు రవాణా వ్యవస్థ లేకపోవడంతో అభివృద్ధి చెందలేదు. 2007లో అప్పటి మెట్‌పల్లి ఎమ్మెల్యే కొమొరెడ్డి రాములు తీసుకున్న నిర్ణయం కమ్మరిపేట గ్రామ స్వరూపాన్నే మార్చేసింది.

19 ఏళ్ల క్రితం లోలెవల్ వంతెన నిర్మాణం

2007 సంవత్సరానికి ముందు కమ్మరిపేట నుంచి సుమారు 20 గ్రామాల ప్రజలు, వాహనదారులు ఈ రోడ్డు గుండా ప్రయాణం చేసేవారు. కానీ వర్షాకాలం వచ్చిందంటే బ్రిడ్జిపై వరద ఉధృతికి 15 కిలోమీటర్లు తిరిగి వెళ్లేవారు. డబ్బుతో పాటు సమయం కూడా వృథా అయ్యేది. 2006లో అప్పటి ఎమ్మెల్యే కొమిరెడ్డి రాములు కమ్మరిపేట పెద్దవాగు ప్రాంతానికి వచ్చి వరద ఉధృతి చూసి రూ.25 లక్షలు బ్రిడ్జి నిర్మాణానికి మంజూరు చేయించారు. 2007–2009 మధ్య అప్పటి పరిస్థితులకు అనుగుణంగా బ్రిడ్జి నిర్మించారు. అసెంబ్లీల పునర్విభజనలో భాగంగా 2009లో మేడిపల్లి మండలం వేములవాడ నియోజకవర్గంలోకి వెళ్లడంతో చెన్నమనేని రమేశ్‌బాబు గెలుపొంది కమ్మరిపేట బ్రిడ్జిని ప్రారంభించారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయి, ఆ రోడ్డు గుండా జగిత్యాలకు వెళ్లే వారి సంఖ్య పెరగడంతో, కమ్మరిపేట బైపాస్ రోడ్డు భూములకు విపరీతమైన ధర పెరిగింది.

మళ్లీ పరిస్థితి మొదటికొస్తుందని భయం

19 ఏళ్ల క్రితం బ్రిడ్జి నిర్మాణం అప్పటి పరిస్థితులకు అనుగుణంగా లో లెవల్ లో నిర్మించారు. మళ్లీ వర్షాకాలంలో బ్రిడ్జి పై నుంచి వరద వస్తోంది. కారణం వర్షాలు అధికంగా కురవడం, పై ప్రాంతాల్లో కుంటలు, చెరువులు కబ్జా చేయడంతో ఒక్కసారిగా వరద ఉధృతి పెరిగి బ్రిడ్జి పైనుంచి వరద వెళ్తోంది. దీంతో బ్రిడ్జి చాలా చోట్ల దెబ్బతింది. బ్రిడ్జి చివరలో రోడ్డు కోసుకపోవడంతో వరదలు వచ్చిన ప్రతిసారి రాకపోకలు బందవుతున్నాయి. మళ్లీ 20 ఏళ్ల పరిస్థితులను గుర్తు చేసుకుంటున్నారు ఆయా గ్రామాల ప్రజలు. ఇప్పుడున్న లో లెవల్ వంతెన స్థానంలో హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను మండల ప్రజలు కోరుతున్నారు.

హై లెవల్ వంతెన నిర్మించాలి



భీమారం మండలంలో కమ్మరిపేట బ్రిడ్జి అతి ముఖ్యమైనది. సుమారు 20 గ్రామాల ప్రజలు ఈ దారి గుండా వెళ్తారు. 2007కి ముందు ఆ దారిలో ఎలాంటి బ్రిడ్జి లేకుండే వాగు ప్రవాహం అధికంగా ఉన్నప్పుడు ప్రజలు, వాహనదారులు చాలా ఇబ్బంది పడేవారు. అప్పటి మెట్‌పల్లి ఎమ్మెల్యే కొమొరెడ్డి రాములు ప్రజల ఇబ్బందులు చూసి 2007లో రూ. రూ.25 లక్షలతో బ్రిడ్జి నిర్మించారు. విప్ ఆది శ్రీనివాస్ హైలెవల్ వంతెన నిర్మించేందుకు కృషి చేయాలి.

– మకిలీ ఇజ్రాయిల్, మాజీ ఎంపీపీ, మేడిపల్లి

వానొస్తే రాకపోకలు బంద్



కమ్మరిపేట–వెంకట్రావుపేట మధ్య పెద్దవాగు పై నిర్మించిన బ్రిడ్జి, కమ్మరిపేట గ్రామ స్వరూపాన్నే మార్చేసింది. 19 ఏళ్ల క్రితం మా గ్రామం ఉమ్మడి మండలానికి సుమారు 10 కిలోమీటర్ల దూరంలో ఉండేది. పెద్దవాగు ఉధృతితో రాకపోకలు బంద్ అయ్యేవి. 15 కిలోమీటర్లు తిరిగి వేరే రోడ్డు గుండా వెళ్లేవారు. 20 గ్రామాల ప్రజలు ఇబ్బంది పడేవారు.బ్రిడ్జి మంజూరుతో గ్రామ స్వరూపం మారిపోయింది. ఇప్పుడు కూడా రాకపోకలు నిలిచిపోతున్నాయి.

– పిట్టల లక్ష్మీరాజిరెడ్డి, మాజీ సర్పంచ్,కమ్మరిపేట

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



పోతారంలో మాట్లాడుతున్న ఎస్సై గీత



మైతాపూర్‌లో అవగాహన కల్పిస్తున్న ఎస్సై, ఎంఈవో

సారంగాపూర్: సైబర్ నేరగాళ్ల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై గీత ప్రజలను కోరారు. బుధవారం రాత్రి మండలంలోని పోతారం గ్రామంలో జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాలతో పోలీస్ కళాబృందాలు మూఢనమ్మకాలు, ఆత్మహత్యల నివారణ, రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నియమాలు, సైబర్ క్రైమ్, గంజాయి, మత్తుపదార్థాలు అన్న అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే నేరగాళ్లను పట్టుకుని, నేరాలను సత్వరమే నియంత్రించ డానికి అవకాశం ఉంటుందన్నారు. గ్రామంలో ఏ సమస్య ఉన్నా ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. పోలీస్ కళా బృందాల పాటలు అలరించాయి.

సైబర్ నేరాలపై అవగాహన

రాయికల్: విద్యార్థులు సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సుధీర్‌రావు తెలిపారు. బుధవారం సైబర్ జాగృక్త దివస్ కార్యక్రమంలో భాగంగా మైతాపూర్, రాయికల్ పట్టణంలో యువతకు, విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం ఓఎల్‌ఎక్స్ మోసాలు, ఏపీకే ఫైల్స్ ఉపయోగించి నకిలీ కస్టమర్ కేర్ మోసాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో రాఘవులు, ఉపాధ్యాయులు పొన్నం రమేశ్ పాల్గొన్నారు.

రాష్ట్ర అధ్యక్షుడికి అభినందన



అభినందనలు తెలుపుతున్న ఎన్ఆర్ఐ నాయకులు

జగిత్యాల: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన రాంచందర్‌రావును బీజేపీ ఎన్ఆర్ఐ సెల్ గల్ఫ్ మిడిల్ ఈస్ట్ పక్షాన అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ డెప్యూటీ కమర్షియల్ టాక్స్ కమిషనర్ మధుకర్‌రెడ్డి, గల్ఫ్ మిడిల్ ఈస్ట్ కన్వీనర్ పన్నీరు నరేంద్ర, అంజి, గంగాధర పాల్గొన్నారు.

ఎంపీడీవోకు వినతి



ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న టీచర్లు

ధర్మపురి: సమగ్ర కుటుంబ సర్వే డ్యూటీలు చేసిన ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు అందజేయాలని తపస్ మండల శాఖ అధ్యక్షుడు కాశెట్టి శ్రీనివాస్ బుధవారం ఎంపీడీవో రవీందర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కనపర్తి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి,సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేస్తున్న కృష్ణారావు

మల్లాపూర్: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందించడమే ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. మండలంలోని గుండంపల్లిలో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముగ్గు పోశారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి, మాజీ ఎంపీపీ నల్ల రాజన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ అంతడపుల పుష్పలత నర్సయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, వనసంరక్షణ సమితి చైర్మన్ సిరిపురం రవీందర్, నాయకులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు వేగంగా పూర్తి చేయాలి

మెట్‌పల్లి: ఇందిరమ్మ ఇళ్ల పనులను లబ్ధిదారులు వేగంగా పూర్తి చేయాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ అన్నారు. పట్టణంలోని 12వార్డులో బుధవారం ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించి మాట్లాడారు. లబ్ధిదారులు నిర్మాణ పనుల్లో జాప్యం చేయవద్దన్నారు. దశలవారీగా ప్రభుత్వం అర్హులందరికీ ఇళ్లను మంజూరు చేస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ షాకీర్ ఉన్నారు.

ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలి

కోరుట్ల రూరల్: ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని ఎంపీడీవో రామకృష్ణా అన్నారు. మండలంలోని పైడిమడుగులో వన మహోత్సవం నిర్వహించి మొక్కలు నాటారు. అనంతరం గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి నిబంధనల ప్రకారం ఇళ్ల నిర్మాణం చేపట్టాలని లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల గ్రీన్ చాలెంజ్

మేడిపల్లి: భీమారం మండలంలో గ్రీన్ చాలెంజ్ నిర్వహించినట్లు బీజేపీ మండల అధ్యక్షుడు నాగం శివకుమార్ తెలిపారు. బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో మండలంలోని రాగోజీపేట, మన్నేగూడెంలో బుధవారం మొక్కలు నాటారు. గ్రీన్ చాలెంజ్‌లో భాగంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మండల అధ్యక్షులకు చాలెంజ్ విసిరారు. ప్రతీ ఒక్కరు పది మొక్కలు నాటాలని వారిని కోరారు. కార్యక్రమంలో నాయకులు చెట్పల్లి రాజేష్, బైరా శ్రీనివాస్, బద్ద జలపతి రెడ్డి, వడ్లకొండ రాము, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక డంపు స్వాధీనం

మల్లాపూర్: మండలంలోని వెంకట్రావ్‌పేట శివారులో బుధవారం రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించి ఇసుకడంపులను గుర్తించి సీజ్ చేయడంతో పాటు పాతదాంరాజుపల్లి శివారులో అక్రమంగా ఇసుక రవాణాకు పాల్పడుతున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు తహసీల్దార్ రమేశ్ గౌడ్ తెలిపారు. అక్రమంగా నిల్వ ఉంచిన 20 ట్రిప్పుల ఇసుకను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే వాల్టాచట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో ఆర్ఐ రాజేశ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గోనెకాపు సంఘం కార్యవర్గం నియామకం

రాయికల్: మండలంలోని రామాజీపేట శివాజీ గోనెకాపు రెడ్డి సంఘం అధ్యక్షుడిగా అంబాల రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా అయిల్నేని రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఇద్దం గంగారెడ్డి, కోశాధికారిగా అయిల్నేని భరత్‌రెడ్డి ఎన్నికయ్యారు.

గోరింటాకు వేడుకలు

కథలాపూర్: మండలంలోని బొమ్మెన ప్రభుత్వ పాఠశాలలో ఆషాడ మాసం సందర్భంగా బుధవారం గోరింటాకు వేడుకలు నిర్వహించారు. ఆషాడ మాసంలో గోరింటాకు ప్రత్యేకతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు మధు కుమార్, అంబటి రవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సేవతోనే గుర్తింపు

జగిత్యాల: జగిత్యాల విద్యాశాఖ కార్యాలయంలో పనిచేసి పెద్దపల్లి జిల్లాకు బదిలీపై వెళ్లిన జిల్లా జెండర్ ఈక్విటీ కో–ఆర్డినేటర్ నమిలికొండ అనుపమను పీఆర్టీయూ నాయకులు బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాశాఖలో అనుపమ సేవలందించారని, ముస్ముందు మరిన్ని సేవలందించేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనందరావు, అమర్‌నాథ్ రెడ్డి పాల్గొన్నారు.

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ

వెల్గటూర్: మండల ఎంపీడీవోగా జక్కుల శ్రీనివాస్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ బాధ్యతలు నిర్వహించిన వెంకటేశ్వరరావు జూన్ 30వ తేదీన పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో ప్రస్తుతం ఎంపీవోగా విధులు నిర్వర్తిస్తున్న శ్రీనివాస్‌ను ఎంపీడీవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా నూతన ఎంపీడీవోకు స్థానిక నాయకులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.



మడేలేశ్వర స్వామి బోనాలు

కోరుట్ల రూరల్: మండలంలోని మోహన్‌రావుపేటలో మడేలయ్య పండగను సోమవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మహిళలు బోనాలను ఊరేగింపుగా తీసుకవెళ్లి మడేలయ్యకు నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో రజక సంఘం సభ్యులు పాల్గొన్నారు.



సారంగాపూర్: మండలంలోని సారంగాపూర్–పోతారం– బట్టపల్లి గ్రామాల మధ్య 3 కిలోమీటర్ల మేర రోడ్డు తారు పోయి, గుంతలు ఏర్పడి, కంకర తేలి ప్రమాదకరంగా మారింది. రోడ్డంతా మట్టి రోడ్డుగా కనిపిస్తోంది. దీనిపై వాహనదారులు ప్రయాణించడం ఇబ్బందిగా మారింది. రోడ్డుకు మరమ్మతులు, తిరిగి బీటీ వేయడానికి రూ. 1.45 కోట్లు మంజూరై రెండేళ్లు దాటినా.. పనులు ప్రారంభం కాలేదు. ఇప్పటికైనా రోడ్డు మరమ్మతు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రాజేందర్, ఆర్అండ్‌బీ,ఏఈ సెల్ నంబర్: 7702353270

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం



భక్తులకు అన్నదానం

రాయికల్: పట్టణంలోని కేశవనగర్‌లో నూతనంగా నిర్మించిన పోచమ్మతల్లి ఆలయంలో బుధవారం విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. వేద పండితులు సతీశ్‌శర్మ, సత్యనారాయణశర్మ, భరత్‌శర్మ, సుధీర్‌శర్మ ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో విగ్రహ దాతలు గంట్యాల ప్రసాద్, వరలక్ష్మి, గంట్యాల ప్రవీణ్, లక్ష్మి, కేశవనగర్ కాలనీవాసులు పాల్గొన్నారు.

పోచమ్మతల్లికి పూజలు

మల్లాపూర్: మండలంలోని చిట్టాపూర్‌లో బుధవారం మహిళలు, భక్తులు గ్రామదేవత పోచమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ పాడిపంటలు సమృద్ధిగా కలగాలని, గ్రామాల్లోని ప్రతి కుటుంబాన్ని సల్లంగా చూడాలని కోరుకున్నామని తెలిపారు.

అయ్యప్ప ఆలయంలో ఉత్తర నక్షత్ర వేడుకలు



అభిషేకం చేస్తున్న భక్తులు

మెట్‌పల్లి: పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో బుధవారం స్వామి జన్మ నక్షత్రమైన ఉత్తర నక్షత్ర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు అశోక్ శర్మ, శుక్ల సాగర్ ఆధ్వర్యంలో పంచామృత అభిషేకం, అష్టోత్తర పూజలు జరిపారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు దొమ్మాటి ప్రవీణ్, ఉపాధ్యక్షులు అంకతి భరత్, బండారి మారుతి, చిలమంతుల శివ, చిట్యాల నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా త్రిశక్తి ఆలయ వార్షికోత్సవం

మెట్‌పల్లి: పట్టణంలోని త్రిశక్తి ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్, కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు పూజలు చేశారు. కమిటీ అధ్యక్షుడు రాజారాం, సభ్యులు పాల్గొన్నారు.

ఈనెల నుంచి ముఖ ధ్రువీకరణ తప్పనిసరి

జగిత్యాల: ఈనెల నుంచి అంగన్‌వాడీ సెంటర్లలో లబ్ధిదారుల ముఖ ధ్రువీకరణ తప్పనిసరని జగిత్యాల సీడీపీవో మమత అన్నారు. జగిత్యాల ప్రాజెక్ట్ పరిధిలోని పలు అంగన్‌వాడీ సెంటర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ సెంటర్లలో ఈనెల నుంచి లబ్ధిదారుల ముఖ ధ్రువీకరణ చేయనున్నట్లు తెలిపారు. గర్భిణులు, బాలింతలు, ఆరు నెలల నుంచి 5 ఏళ్ల పిల్లలకు ఈనెల నుంచి ఫేస్ క్యాప్చర్ ఈ కేవైసీ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో పోషణ అభియాన్ కో–ఆర్డినేటర్ మధు పాల్గొన్నారు.

కేజీ వీల్స్ ట్రాక్టర్లు రోడ్డుపై వెళ్తే చర్యలు

కథలాపూర్: కేజీ వీల్స్ ట్రాక్టర్లు తారు రోడ్డుపై వెళ్లితే చర్యలు తీసుకుంటామని కథలాపూర్ ఎస్సై నవీన్ కుమార్ అన్నారు. బుధవారం కథలాపూర్ పోలీస్ స్టేషన్‌లో తక్కళ్లపెల్లి, బొమ్మెన గ్రామాలకు చెందిన కులసంఘాల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. తక్కళ్లపెల్లి, బొమ్మెన గ్రామాల్లో ప్రభుత్వ నిధులు లక్షలాది రూపాయలు వెచ్చించి ఇటీవలే తారు రోడ్డు నిర్మించారని, ఈ రోడ్డుపై కేజీవీల్స్ ట్రాక్టర్లు వెళ్లితే రోడ్డు ధ్వంసమవుతుందన్నారు. ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై సూచించారు.

నోట్‌బుక్స్ పంపిణీ

ఇబ్రహీంపట్నం: మండలంలోని డబ్బా గ్రామంలో బుధవారం ఫ్రెండ్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటు బుక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు సురిగి శ్రీనివాస్ గౌడ్, అశోక్ గౌడ్, చింటూ, రవి, సాయి, ప్రశాంత్, సునీల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వ పాఠశాలలో హెచ్‌ఎం తనుగుల రమేశ్‌ను ఎంఈవో రమేశ్ బుధవారం సన్మానించారు. పాఠశాలలో 40 మంది విద్యార్థులు ఉండగా ఈ విద్యాసంవత్సరం 70 మందికి పెంచారు. దీంతో ఆయనను ఎంఈవోను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

ధర్మపురి: మండలంలోని దుబ్బల గూడెం ప్రభుత్వ పాఠశాలకు చెందిన పేద విద్యార్థులకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నోటు బుక్కులు, పెన్నులను పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ 320 జీ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రూ.6 వేల విలువ గల విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంఈవో సీతామహా లక్ష్మి, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు కొలిచాల శ్రీనివాస్,కాశెట్టి శారద, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రవీందర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పిల్లలకు కుర్చీలు వితరణ

ధర్మపురి: పట్టణంలోని న్యూ హరిజనవాడలోని అంగన్‌వాడీ కేంద్రంలో చదివే పేద విద్యార్థులకు బుధవారం ధర్మపురికి చెందిన వేద పండితులు నారంభట్ల ప్రశాంత్‌శర్మ తన పెద్దమ్మ బలిజపెల్లి విజయమ్మ జ్ఞాపకార్థంగా రూ.5 వేల విలువ గల కుర్చీలను అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీముఖి కనక తార, ఉపాధ్యాయులు రొట్టె సరిత, మ్యాన సునీత, అంగన్‌వాడీ టీచర్ పాల్గొన్నారు.

పెద్దపులి వేషధారుల సందడి

మల్యాల: మొహర్రం వేడుకల్లో భాగంగా మండల కేంద్రంలో పెద్దపులి వేషధారుల విన్యాసాలతో సందడితో నెలకొంది. అంగడి బజార్‌లోని పీరీల వద్దకు వెళ్లి, మొక్కులు చెల్లించుకున్న పెద్దపులి వేషధారులు డప్పు చప్పుళ్ల మధ్య నృత్యాలు చేస్తూ, అలరించారు.